క్లుప్తంగా

కేంద్ర బలగాల కవాతు



ద్రాక్షారామలో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

రామచంద్రపురం రూరల్: రానున్న ఎన్నికల్లో ప్రజలు ఎటువంటి భయాందోళనలకు గురికాకుండా నిర్భయంగా ఓటు వేసేలా అండగా ఉంటామని భరోసా కల్పిస్తూ కేంద్ర బలగాలు సీఐఎస్‌ఎఫ్ -505 బెటాలియన్ ఆధ్వర్యంలో మండలంలోని ద్రాక్షారామ, భీమక్రోసుపాలెం, తోటపేట గ్రామాల వీధుల్లో బుధవారం కవాతు నిర్వహించారు. రామచంద్రపురం డీఎస్పీ రామకృష్ణ నేతృత్వంలో సీఐ దొరరాజు, ద్రాక్షారామ ఎస్సై సురేంద్ర పాల్గొన్నారు.

ముగిసిన నూకాంబిక అమ్మవారి జాతర

కపిలేశ్వరపురం: అంగరలో నూకాంబిక అమ్మవారి జాతర ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. అంగర, పడమర ఖండ్రిక గ్రామాల భక్తులు అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించారు. ఆయా గ్రామాలకు చెందిన ఆడపడుచులు అమ్మవారికి ముడుపులు చెల్లించుకున్నారు. ఉత్సవ నిర్వహణకు సహకరించిన ఇరు గ్రామాల భక్తులకు ఉత్సవ నిర్వాహక కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

వంగా శ్రీనుకు పలువురి పరామర్శ

కపిలేశ్వరపురం: పితృ వియోగంతో బాధపడుతున్న పడమర ఖండ్రిక గ్రామ మాజీ సర్పంచ్ వంగా శ్రీనివాస్‌ను బుధవారం ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకులు, అంగర, పడమర ఖండ్రిక గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు పరామర్శించారు. శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాజులూరు: గొల్లపాలెం 333/11 కేవీ విద్యుత్ స్టేషన్ పరిధిలోని కాజులూరు, కరప, తాళ్లరేవు మండలాల్లోని పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ కాకినాడ డీఈ జి.ప్రసాద్ తెలిపారు. బుధవారం గొల్లపాలెం మెయిన్ సబ్‌స్టేషన్ ఏఈ ఎం.సూర్యనారయణ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సబ్‌స్టేషన్, విద్యుత్ లైన్ల మరమ్మతులు, ట్రీ కటింగ్ పనుల్లో భాగంగా ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయవలసి వస్తుందన్నారు. గొల్లపాలెం ఎస్‌ఎస్ హెచ్‌క్యూ ఫీడర్ పరిధిలోని కాజులూరు మండలంలోని గొల్లపాలెం, ఆర్యావటం, మొగలిపాలెం, శలపాక, తణుకువాడ, మంజేరు, శీల, శీలలంక, ఒంటితాడి కాజులూరు, అయితపూడి, తిప్పరాజుపాలెం, తాళ్లరేవు మండలం బొడ్డువానిలంక, కరప మండలం కొంగోడు, గొర్రిపూడి తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. విద్యుత్‌లైన్లలోని గృహవాసాలతో పాటు ఇండస్ట్రియల్ ఫీడర్, ఆక్వా చెరువులకు విద్యుత్ సరఫరా నిలిపివేయవలసి వస్తుందని ప్రజలు సహకరించాలన్నారు.

13న రిటైర్డ్ ఉద్యోగుల సమావేశం

కపిలేశ్వరపురం: మండపేట పట్టణంలోని శ్రీరామ హిందూ మున్సిపల్ యూపీ పాఠశాలలో ఈ నెల 13న రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సమావేశం నిర్వహించనున్నట్టు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు దేవళ్ల సత్యనారాయణ, పెంకే గోవిందరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం మూడు గంటలకు నిర్వహించే సమావేశంలో రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలపై చర్చించనున్నట్టు వారు తెలిపారు.

వాహనాల తనిఖీ



రాయవరంలో వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్సై నరేష్, సిబ్బంది

రాయవరం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాయవరం ఎస్సై జి.నరేష్ వాహనాల తనిఖీ చేపట్టారు. నిబంధనల మేరకు రూ.50వేలకు మించి నగదును తీసుకువెళితే సీజ్ చేస్తామన్నారు. తనిఖీల్లో ఏఎస్సై పి.వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్యకర్తలకు వెన్నుదన్నుగా వైఎస్సార్ సీపీ

- పార్టీలో పలు గ్రామాల నుంచి పలువురు కార్యకర్తల చేరిక
- కండువాలు వేసి ఆహ్వానించిన ఎమ్మెల్యే అభ్యర్థులు త్రిమూర్తులు, సూర్యప్రకాశ్



టేకిలో ఎమ్మెల్సీ తోట సమక్షంలో పార్టీలో చేరుతున్న వీరవేణి



కాజులూరులో వైఎస్సార్ సీపీలో చేరిన కార్యకర్తలు, నాయకులకు పార్టీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి సూర్యప్రకాశ్, పితాని బాలకృష్ణ తదితరులు

కపిలేశ్వరపురం: మండలంలోని టేకి గ్రామ మాజీ సర్పంచ్ గంటి వీరవేణి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. టేకిలో మంగళవారం రాత్రి ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు శీలం గోవిందు, సర్పంచ్ కుక్కల నాగమణి, ఎంపీటీసీ ఉమ్మిడిశెట్టి వీరవేణి, గ్రామ కమిటీ అధ్యక్షుడు కుక్కల బాలయ్య, మండల సాగు సలహా మండలి చైర్మన్ పుట్టా కృష్ణమూర్తి సమక్షంలో గ్రామానికి చెందిన పలువురు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారందరికీ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పార్టీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు. గంటి వీరవేణి మాట్లాడుతూ సీఎం జగన్ సంక్షేమ పాలనలో మండపేట నియోజకవర్గాన్ని విశేషంగా అభివృద్ధి చేసిన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు విజయానికి కృషి చేస్తానన్నారు. పార్టీలో చేరినవారిలో గంటి లక్ష్మణరావు, దాకారపు కృష్ణమూర్తి, ఎంద్రపు దుర్గారావు, శశి కుమార్, ఏరుకొండ వెంకన్న, గుత్తుల మణికంఠ స్వామి, చింతపల్లి వెంకటరావు, పిల్లి శ్రీను, పుట్టా సూరిబాబు, సత్యవాడ ప్రతాప్, చాటరాజు సత్యనారాయణ, మారిశెట్టి విజయ్ ఉన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాంబాబు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ కుక్కల సుబ్రమణ్యం పాల్గొన్నారు.

జనసేన నుంచి చేరిక

కె.గంగవరం: మండలంలోని సత్యవాడ గ్రామానికి చెందిన పలువురు జనసేన నాయకులు, కార్యకర్తలు బుధవారం వైఎస్సార్ సీపీలో చేరారు. వైఎస్సార్ సీపీ మండల ఉపాధ్యక్షుడు సలాది అర్జునరావు ఆధ్వర్యంలో జనసేనకు చెందిన అడబాల హరిబాబు, కనకాల నారాయణరావు, సలాది సోమన్నతో పాటు వారి వర్గానికి చెందిన సుమారు 50 మంది వైఎస్సార్ సీపీ రామచంద్రపురం కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్ సమక్షంలో పార్టీలో చేరారు. వారిని సూర్యప్రకాష్ పార్టీ కండువా వేసి వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ సీఎంగా జగన్ మంచి పరిపాలన చేస్తున్నారని పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఆయన పాలనకు ఆకర్షితులై చేరామన్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ సీఎంగా జగన్‌మోహన్ రెడ్డిని చేసేందుకు కృషి చేస్తామన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు చింతలపాటి శ్రీనివాసరాజు, యువజన నాయకులు జుత్తుక శ్యాంప్రసాద్, సచివాలయాల మండల కన్వీనర్ తోకల శ్రీను తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

జగనన్న పథకాలు దేశానికే ఆదర్శం

కాజులూరు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని రామచంద్రపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్ అన్నారు. కాజులూరు జెడ్పీటీసీ వనుం వెంకటసుబ్బారావు సోదరుడు, జనసేన మండల బీసీ సెల్ కార్యదర్శి వనుం ఈశ్వరరావు, ఆర్యావటం జనసేన గ్రామ కమిటీ అధ్యక్షుడు చింతాకుల ప్రసాద్‌లు బుధవారం మండలంలోని పలు గ్రామాలకు చెందిన సుమారు 200 మంది జనసేన నాయకులు, కార్యకర్తలతో వైఎస్సార్ సీపీలో చేరారు. ఎమ్మెల్యే అభ్యర్థి సూర్యప్రకాశ్, ముమ్మిడివరానికి చెందిన పార్టీ నాయకులు పితాని బాలకృష్ణ, పార్టీ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు నూతలపాటి శ్రీనివాసరాజు తదితరులు పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి స్వాగతం పలికారు. సూర్యప్రకాశ్ మాట్లాడుతూ జగనన్న అమలు చేసిన సంక్షేమ పథకాలతో రాష్ట్రంలోని అన్ని వర్గాలకు లబ్ధి చేకూరిందన్నారు. జగనన్న పాలన మెచ్చి ఇతర పార్టీల నుంచి కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరుతున్నారన్నారు. అనంతరం ముమ్మిడివరానికి చెందిన పార్టీ నాయకుడు పితాని బాలకృష్ణ మాట్లాడుతూ సామాజికన్యాయం పేరుతో పార్టీని స్థాపించిన పవన్‌కళ్యాణ్ రాష్ట్రవ్యాప్తంగా శెట్టిబలిజలకు ఒక్కసీటు కూడా కేటాయించకుండా తమ వర్గాన్ని మోసం చేశారన్నారు. ఓపిక లేని చంద్రబాబుని, సరిగా మాట్లాడటం కూడా చేతకాని లోకేష్‌ని సీఎంని చేయాలనే లక్ష్యంతో తనను నమ్ముకున్న సొంత సామాజిక వర్గానికి తీరని అన్యాయం చేశారన్నారు. అందుకే జనసేన నుంచి కార్యకర్తలంతా వైఎస్సార్ సీపీలోకి వలసలు వస్తున్నారని త్వరలో ఆ పార్టీ ఖాళీ అవుతుందన్నారు. కార్యక్రమంలో పెంకే ప్రసాద్ పీఏసీఎస్ చైర్మన్ కురుపూడి సూర్యనారాయణ, పాలిక వీరబాబు, గుజ్జాపు సత్యనారాయణ, చప్పిడి విజయ్, కాకరపల్లి విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.



సత్యవాడలో పార్టీలో చేరిన వారికి కండువా వేసి ఆహ్వానిస్తున్న పిల్లి సూర్యప్రకాశ్ తదితరులు



ఏడిదలో సూర్యారావుకు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

తాళ్లపొలంలో..

రామచంద్రపురం రూరల్: మండలంలోని తాళ్లపొలం గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు దెయ్యాల సత్యనారాయణ తన అనుచరులతో కలసి బుధవారం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరారు. సూర్యప్రకాశ్ వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. సూర్యప్రకాశ్ మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సువర్ణ అధ్యాయంగా నిలిచిపోతుందన్నారు. అటువంటి పాలన మళ్లీ కావాలంటే అందరూ సమష్టిగా పనిచేసి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కట్టా గోవిందు, ఉప సర్పంచ్ వల్లు శివ, ఎంపీటీసీ పంపన ఏడుకొండలు, నాయకులు అనిశెట్టి రామకృష్ణ, అడివి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మండపేట: కార్యకర్తలందరికీ వైఎస్సార్ సీపీ వెన్నుదన్నుగా ఉంటుందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు చెప్పారు. ఏడిద నుంచి గత పంచాయతీ ఎన్నికల్లో జనసేన నుంచి సర్పంచ్‌గా పోటీ చేసిన పలివెల సూర్యారావు ఆ పార్టీకి రాజీనామా చేసి వైఎస్సార్ సీపీలో చేరారు. బుధవారం స్థానిక విజయలక్ష్మి నగర్‌లో ఎమ్మెల్సీ తోట ఆయనకు పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు.

ఈ సందర్భంగా సూర్యారావు మాట్లాడుతూ నియోజకవర్గ జనసేన నాయకుడి విధానాలు నచ్చక ఆ పార్టీకి చేరినట్టు తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలకు, తోట త్రిమూర్తులు నాయకత్వ పటిమకు ముగ్ధుడినై చేరానని వివరించారు. నూతనంగా పార్టీలోకి చేరిన వారందరికీ తాను అండగా ఉంటానని తోట భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాధాకృష్ణ, ఆ పార్టీ నాయకులు మేడిశెట్టి సూర్యభాస్కరరావు, వల్లూరి రామకృష్ణ, కౌన్సిలర్ పోతంశెట్టి వరప్రసాద్, టౌన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, యాండ్ర ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలి



ఊడిమూడి బూత్ కమిటీ సభ్యులతో పరిశీలకుడు శ్రీనివాసరాజు, మండల అధ్యక్షుడు పెట్టా శ్రీనివాస్ తదితరులు

కె.గంగవరం: బూత్ స్థాయి నుంచి వైఎస్సార్ సీపీని బలోపేతం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు చింతలపూడి శ్రీనివాసరాజు, పార్టీ మండల అధ్యక్షుడు పెట్టా శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మండలంలోని ఊడిమూడి, కోటిపల్లి, కె.గంగవరం, కుందూరు తదితర గ్రామాల్లో బుధవారం వారు పర్యటించి గ్రామ స్థాయిలో బూత్ కమిటీలను ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పార్టీ కేడర్ మొత్తం సమాయత్తం కావాలన్నారు. బూత్ స్థాయిలో ఉన్న పార్టీ నాయకులు ప్రతి ఒక్క ఓటరు వద్దకు వెళ్లి వైఎస్సార్ సీపీ హయాంలో జరిగిన లబ్ధి, సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరించాలని కోరారు. మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని చేసేందుకు గ్రామ స్థాయి కార్యకర్తలు, నాయకులు చర్యలు తీసుకోవాలని కోరారు. రామచంద్రాపురం నియోజకవర్గ పార్టీ అభ్యర్థి పిల్లి సూర్యప్రకాష్‌ను అఖండ మెజారిటీతో గెలిపించాలని వారు కోరారు. సచివాలయాల మండల కన్వీనర్ తోకల శ్రీను, బీసీ నాయకులు పంపన సుబ్బారావు, కోటిపల్లి సొసైటీ అధ్యక్షుడు సాదా వెంగళరావు, జిల్లా వ్యవసాయ సలహా కమిటీ సభ్యులు బత్తుల అప్పారావు, యర్రంశెట్టి పుల్లేశ్వరరావు పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మీ ఆదరణ మరువలేనిది..

- సదా అందుబాటులో ఉంటాను..
- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సూర్యప్రకాశ్



తాళ్లపొలంలో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్

రామచంద్రపురం రూరల్: వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా నాపై మీరు చూపిస్తున్న ఆదరణ జీవితాంతం మరువలేనని, అందరికీ సదా అందుబాటులో ఉండి మీకు సేవ చేయడం ద్వారా మీ రుణం తీర్చుకుంటానని రామచంద్రపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్ తాళ్లపొలం గ్రామస్తులతో అన్నారు. మండలంలోని తాళ్లపొలంలో బుధవారం ఆయన గ్రామ సర్పంచ్ కట్టా గోవిందు, ఎంపీటీసీ పంపన ఏడుకొండలు ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గ్రామస్తులు పెద్ద ఎత్తున ప్రచారం పాల్గొని అడుగడుగునా సూర్యప్రకాశ్‌పై పూలు జల్లుతూ తమ అభిమానం చాటారు. మహిళలు హారతులు ఇస్తూ, యువకులు జేజేలు పలుకుతూ ప్రచారంలో హోరెత్తించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ అంబటి భవాని, ఏపీఐడీసీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పన్ను చెల్లింపులో 5 శాతం రాయితీ



కమిషనర్ రాము

మండపేట: పురపాలక సంఘంలో మార్చి నెలాఖరులోగా ఆస్తి పన్ను కట్టని వారు ఈ నెలాఖరు లోపు ఐదు శాతం రాయితీతో చెల్లించవచ్చని మున్సిపల్ కమిషనర్ బి.రాము తెలిపారు. మండపేట మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ మీడియాతో మాట్లాడారు. పట్టణంలో ఆస్తి పన్ను వసూలుకు సంబంధించి ఈ నెలాఖరు వరకు ఐదు శాతం వడ్డీరాయితీ గడువు ఇచ్చినట్టు తెలిపారు. కొంతమంది డిమాండ్ నోటీసు అందలేదని చెబుతున్నారని, అయితే సచివాలయాలు ద్వారా అందరికీ చెప్పామన్నారు. డిమాండ్ నోటీసు రాని వారు పాత ఆస్తి పన్ను అసెస్మెంట్ నెంబర్ చెబితే దాన్ని బట్టి మున్సిపల్ కార్యాలయంలో పన్ను చెల్లించవచ్చని వివరించారు. ఈ అవకాశాన్ని పట్టణంలోని ప్రజలంతా వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

రామచంద్రపురం: పురపాలక సంఘ పరిధిలో ఆస్తి, ఖాళీ స్థలాలు, కుళాయి పన్నులకు సంబంధించి 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను ముందస్తు పన్నును ఏకమొత్తంగా చెల్లించినట్లయితే అటువంటి వారికి 5 శాతం రిబేటును ప్రభుత్వం అందిస్తుందని మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 30వ తేదీ లోపుగా పన్నులను ఏకమొత్తంగా చెల్లించినచో రిబేటు వస్తుందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు.

వలంటీర్ల సత్తా చూపుతాం



రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శి రామకృష్ణకు అందిస్తున్న యర్రపోతవరం వలంటీర్లు



రాజీనామా పత్రాలను ఎంపీడీఓ కార్యాలయ సిబ్బందికి అందిస్తున్న అద్దంపల్లి వలంటీర్లు

కె.గంగవరం: టీడీపీ, జనసేన నాయకుల వేధింపులు భరించలేక తమ ఉద్యోగాలకు రాజీనామా చేస్తున్నట్లు యర్రపోతవరం, అద్దంపల్లి గ్రామ వలంటీర్లు స్పష్టం చేశారు. మండలంలోని అద్దంపల్లి గ్రామానికి చెందిన 11 మంది వలంటీర్లు ఎంపీడీఓ కార్యాలయంలో మూకుమ్మడిగా రాజీనామా పత్రాలను అందించగా యర్రపోతవరం గ్రామానికి చెందిన ఆరుగురు వలంటీర్లు పంచాయతీ కార్యదర్శి రామకృష్ణకు బుధవారం రాజీనామా పత్రాలను అందించారు. వారు మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీలు వలంటీర్లపై నిరాధార గ్లోబల్ ప్రచారాలు చేస్తున్నారని వాటిని తిప్పికొట్టి ప్రజలకు వాస్తవాలు వివరించి వైఎస్సార్ సీపీ పార్టీ విజయానికి కృషి చేస్తామన్నారు. గతంలో టీడీపీ–జనసేన పార్టీ నాయకులు వలంటీర్లను నానారకాలుగా తిట్టారని ఇప్పుడు ఎన్నికల నేపథ్యంలో ఎక్కడ లేని ప్రేమ చూపిస్తున్నారని విమర్శించారు. అనంతరం అద్దంపల్లి వలంటీర్లు సర్పంచ్ చింతపల్లి లక్ష్మీ వెంకటరమణ, వైస్ ఎంపీపీ దూడల నాగేశ్వరరావులతో కలసి రామచంద్రపురం నియోజవకర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాష్‌ను కలసి పార్టీ విజయానికి కృషి చేస్తామన్నారు. యర్రపోతవరం సర్పంచ్ పిల్లి రాంబాబు, డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాస్, అద్దంపల్లి మాజీ సర్పంచ్ చింతపల్లి వెంకటరమణ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అన్ని వర్గాల ప్రజలకు మేలు

- ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఆశీర్వదించండి
- మున్సిపల్ చైర్ పర్సన్ దుర్గారాణి



రావులపేట వీధిలో ప్రచారం చేస్తున్న నాయకులు

మండపేట: అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ కార్యక్రమాల ద్వారా మేలు చేసిన ఏకైక ప్రభుత్వం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో సాగిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వమని మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ దుర్గారాణి పేర్కొన్నారు. 21వ వార్డులో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాధాకృష్ణ, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వేగుళ్ల పట్టాభి రామయ్య చౌదరిలతో కలిసి చైర్ పర్సన్ దుర్గారాణి వార్డుల్లో ప్రచారం చేశారు. ప్రతి గుమ్మానికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. మీ ఇంట్లో సంక్షేమ పథకాల లబ్ధిని పొందారా? అని అడిగారు. ఐదేళ్ల కాలంలో మీకు మంచి జరిగితేనే తనను ఆశీర్వదించమని సీఎం జగన్ కోరుతున్నారని, లబ్ధి పొందిన వారంతా ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. వైసీపీ టౌన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, ఆ వార్డు ఇన్‌చార్జి కంది నాగశ్రీదేవిల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ డైరెక్టర్లు మీగడ శ్రీనివాస్ షేక్ అలీఖాన్ బాబా, సొసైటీ ప్రెసిడెంట్ పెంకే గంగాధర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొప్పిరెడ్డి పద్మావతి, పార్టీ నాయకులు శెట్టి నాగేశ్వరరావు, కంది నాగన్న, కొడమంచిలి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన అవసరం



అంగరలో గర్భిణిని పరీక్షిస్తున్న డాక్టర్ అనూజ ప్రియాంక

కపిలేశ్వరపురం: గర్భిణులకు పౌష్టికాహారంపై అవగాహనతో మెలగాలని డాక్టర్ జె.అనూజ ప్రియాంక అన్నారు. అంగర పీహెచ్‌సీలో బుధవారం ప్రధాన మంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన శిబిరంలో 25 మంది గర్భిణులను పరీక్షించారు. వారిలో ఆరు హైరిస్క్ కేసులుగా గుర్తించి, మెరుగైన చికిత్స చేయించాలని ఉన్నతాధికారులకు నివేదించారు. డాక్టర్ అనూజ ప్రియాంక మాట్లాడుతూ గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. పోషక విలువలున్న ఆహారంపై ఎంపీహెచ్‌ఈఓ జుత్తుక మల్లికర్జునుడు, హెచ్ఈ బి.రామారావు, హెచ్‌వి తాతపూడి మేరీమణి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌ఓ, వైద్య ఆరోగ్య, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జ్యోతిషరత్న అవార్డు అందుకున్న వీర్రాజు



అవార్డు అందుకుంటున్న వీర్రాజు

రాయవరం: రెండు దశాబ్దాలకు పైగా జ్యోతిష శాస్త్రంలో చేస్తున్న కృషికి గుర్తింపుగా రాయవరం గ్రామానికి చెందిన బోడా వీర్రాజుకు జ్యోతిష రత్న అవార్డును అందుకున్నారు. ఈ విషయాన్ని వీర్రాజు బుధవారం విలేకరులకు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన విశ్వజ్యోతి జ్యోతిష విజ్ఞాన సంస్థ 11వ వేదిక్ ఆస్ట్రాలజీ కాంక్లేవ్‌ను పురస్కరించుకుని వీర్రాజుకు రాజమహేంద్రవరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డును కంచి పీఠం ఆస్థాన సిద్ధాంతి లక్కావఝ్జల విజయసుబ్రహ్మణ్యం, బుద్ధా శ్రీనివాసశర్మ, ఇంద్రగంటి గోపాలకృష్ణల చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఉగాది పర్వదినం పురస్కరించుకుని మండపేటకు చెందిన వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ సంస్థ 'సేవారత్న' అవార్డును అందజేసిందన్నారు. మండపేటలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డును వాసవీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ అంగర ప్రవీణ్, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షుడు నూలి వెంకటరమణమూర్తి చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నట్టు ఆయన తెలిపారు. జ్యోతిష శాస్త్రంలో రెండు దశాబ్దాలుగా విశేషమైన కృషి చేశానన్నారు. జ్యోతిషరత్న, సేవా రత్న అవార్డును అందుకున్న వీర్రాజును రాయవరం, వెదురుపాక, వి.సావరం గ్రామాలకు చెందిన పలువురు అభినందించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటేశ్వరరావు

రామచంద్రపురం రూరల్: రైతులు పండించిన రబీ పంట ధాన్యం కొనుగోలుకు సంబంధించి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ, తదితర అంశాలపై వీఏఏలు, ఆర్బీకేల్లో పనిచేసే టీఏలు, డీఈఓలు, హెల్పర్లకు బుధవారం రామచంద్రపురం తహసీల్దార్ కార్యాలయంలో మండల వ్యవసాయ అధికారి ఎన్.సత్యప్రసాద్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ మైలా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం కనీస మద్దతు ధర 75 కేజీల బస్తాకు రూ.1,637, 100 కేజీల బస్తాకు రూ.2,183 గా ప్రకటించిందన్నారు. ఏఓ సత్యప్రసాద్ మాట్లాడుతూ ఆర్‌బీకేల్లో సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందేలా ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్దనే అమ్ముకునేలా రైతుల్లో అవగాహన కల్పించాలని తెలిపారు. ఆర్బీకేల ద్వారా అమ్ముకుంటే రవాణా ఖర్చులు తిరిగి రైతుల ఖాతాల్లో జమ అవుతాయని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ బొక్కా గోపాలకృష్ణ, ఆర్ఐ కర్రి మహాలక్ష్మినాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా డాక్టర్ హనీమన్ జయంతి



హనీమన్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న హోమియో వైద్యులు

మండపేట: హోమియో వైద్య విధానాన్ని సంపూర్ణ చికిత్స విధానంగా రూపుదిద్దిన మహనీయుడు, హోమియో వైద్య సృష్టికర్త డాక్టర్ హనీమన్ అని మండపేటకు చెందిన ప్రముఖ సీనియర్ హోమియో వైద్యులు చల్లా రవికుమార్ పేర్కొన్నారు. డాక్టర్ హనీమన్ జయంతి వేడుకలను మండపేటలోని గౌతమి హోమియో వైద్యశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ చల్లా మాట్లాడుతూ వివిధ రోగాలను తగ్గించగల అనేక రసాయనాలని తన శరీరంపై ప్రయోగించుకోవడం ద్వారా వివిధ పదార్థాల్లో ఉన్న రసాయన, ఔషధ ధర్మాన్ని ఆయన కనిపెట్టారన్నారు. ప్రపంచంలో 80కి పైగా దేశాల్లో హోమియో వైద్య విధానం ప్రాచుర్యంలో ఉందన్నారు. తొలుత డాక్టర్ హనీమన్ చిత్రపటానికి గౌతమీ హోమియో క్లినిక్ వైద్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నీరజ, డాక్టర్ నాగదేవి, డాక్టర్ హనీచైతన్య, మెడికల్ అసిస్టెంట్లు చాందిని, నాగలక్ష్మి, ప్రసన్న, జ్యోతి, సిబ్బంది కుమారి, రాధిక, శ్రీనివాస్, అయ్యప్ప, వెంకటలక్ష్మి, మణి హోమియో వైద్య అభిమానులు మెహర్, తేజ, పావని, వరలక్ష్మి, లక్ష్మి, ప్రభోద్ విరణ్య తదితరులు పాల్గొన్నారు.

రహదారి.. పచ్చని పందిరి



మండు వేసవిలో ప్రయాణికులు చల్లదనం కోసం రహదారి పక్కన ఉన్న చెట్ల నీడను ఆశ్రయిస్తుంటారు. ప్రస్తుతం ఎండల్లో పలు రహదారుల్లో పచ్చదనంతో కూడిన చెట్లు వాహన చోదకులు, ప్రయాణికులకు నీడనిస్తున్నాయి. మండలంలోని మాచవరం–పసలపూడి, రాయవరం–లొల్ల, పసలపూడి–చోడవరం రహదారులపై రోడ్డుకిరువైపులా ఉన్న తరువులు పచ్చని పందిరి వేసినట్టుగా అలముకున్నాయి. ఈ రహదారుల్లో ప్రయాణించే ప్రయాణికులు, వాహనదారులు ఎండ వేడిని తట్టుకునేందుకు కొంతసేపు చెట్ల కింద విశ్రమిస్తున్నారు.

– రాయవరం